దేవాదాయశాఖ అధీనంలోకి వేంకటేశ్వర ఆలయం



వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని స్వాధీనం చేసుకుంటున్న దేవాదాయశాఖ అధికారులు

గచ్చిబౌలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. గత సంవత్సరం జూలైలో కొండాపూర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఫిర్యాదు రావడంతో దేవాదాయశాఖ కమిషనర్ శుక్రవారం ఆలయాన్ని స్వాధీనం చేసుకోమని సంబంధిత అధికారులను ఆదేశించారు. అప్పట్లో ఎన్నికల కోడ్ ఉన్నందున వాయిదా పడింది. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం రంగారెడ్డి జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, ఇన్‌స్పెక్టర్ మధు, ఏవో అరుణకుమారి, ఇతర సిబ్బందితో వచ్చి కొండాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ఉన్న హుండీని సీజ్ చేశారు. ఆలయాన్ని స్వాధీనం చేసుకుంటున్నామని చెప్పగా ఆలయ కమిటీ కొంత గడువు ఇవ్వమని అడుగగా, అధికారులు ఇవ్వలేదు. దీంతో అధికారులకు ఆలయ కిటీ సభ్యులు, స్థానికులతో వాగ్వాదం జరిగింది. ఈసందర్భంగా దేవాదాయశాఖ అధికారులు మాట్లాడుతూ ఈవో పర్యవేక్షణలో అర్చకులు యధావిధిగా పూజా కార్యక్రమాలు కొనసాగించుకోవచ్చని, భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం దేవాదాయశాఖ అధికారులు వెళ్లిపోయారు. అక్కడే ఉన్న ఆలయ కమిటీ సభ్యులు సమావేశం ఏర్పాటు చేసుకుని విషయాన్ని దేవాదాయ శాఖ కమిషనర్‌ను కలిసి విషయాన్ని వివరిద్దామని తీర్మానించారు.

మెడికవర్ ఆస్పత్రిలో కేన్సర్‌పై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ వెంకట్ సింహ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శరీరంలో క్రమపద్ధతిలో జరిగే కణవిభజన కొన్ని కారణాల వల్ల నియంత్రణ కోల్పోయి అస్తవ్యస్తంగా విభజన జరిగి ఏర్పడే కణాల సమూహామే కేన్సర్ అని మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ వెంకట్ సింహ అన్నారు. వరల్డ్ కేన్సర్ డే సందర్భంగా మెడికవర్ ఆస్పత్రిలో శుక్రవారం లండన్ మేనేజ్‌మెంట్ అకాడమీ సహకారంతో 'క్లోజ్ ద కేర్ గ్యాప్' పేరుతో అవగాహన సదస్సును నిర్వహించారు. దేశంలో ఎక్కువ మరణాలు గుండెజబ్బుల కారణంగా సంభవిస్తుండగా, రెండో స్థానంలో కేన్సర్ ఉందన్నారు. దేశంలో ఏటా దాదాపు 11 లక్షల మందికి కేన్సర్ బారిన పడినట్టు నిర్ధారణ అవుతుందన్నారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరికి వ్యాధి ముదిరిన తర్వాతే తెలుస్తోందని, దీంతో మరణాలు ఎక్కువ సంభవిస్తున్నాయన్నారు. కేన్సర్ అంటువ్యాధి కాదని, జన్యుపరంగా వచ్చే అవకాశం కూడా తక్కువేనని అన్నారు. కేన్సర్ రావడానికి ఆధునిక జీవన శైలి ప్రధాన కారణమన్నారు. మద్యం, పొగతాగడం, ఆహారపదార్థాల్లో రంగులు వినియోగం, రసాయనాలు వాడటం, హార్మోన్లు అధికంగా వాడటం, అధిక బరువు, కాలుష్యం, క్రిమిసంహారకాలు, చికిత్సలో భాగంగా లేదా ప్రమాదవశాత్తు రేడియేషన్‌కు గురికావడం, తరచూ వేధించే ఇన్ఫెక్షన్ల కారణంగా కేన్సర్ వచ్చే అవకాశముందన్నారు. కొన్ని కేన్సర్‌లను వ్యాక్సిన్స్ ద్వారా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో మెడికవర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత కేన్సర్ పరీక్షలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వరల్డ్ కేన్సర్ డే సందర్భంగా మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్, ఆహా క్లినిక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి 9వ తేదీ వరకు ఉచిత కేన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గచ్చిబౌలి టెలికాంనగర్‌లో ఆహా క్లినిక్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇందులో పాపిస్మియర్ టెస్ట్, మమో స్క్రీనింగ్, రాండమ్ బ్లడ్ షుగర్, కేన్సర్ స్పెషలిస్ట్ కన్సల్టేషన్, గైనకాలజీ కన్సల్టేషన్ సేవలు అందించనున్నట్టు తెలిపారు. దగ్గినప్పుడు రక్తం, తరచుగా కడుపునొప్పితో పాటు జ్వరం, ఆహారం నమలడం లేదా మింగడంలో ఇబ్బంది, శరీరంపై గడ్డలు, మలంలో రక్తం, అకారణంగా బరువుతగ్గడం, విపరీతమైన దగ్గు వంటి లక్షణాలతో బాధపడేవారు, పొగాకు తాగడం, నమలడం అలవాటు ఉన్న వారు పరీక్షలు చేయించుకునేందుకు 9888977712 నెంబర్‌కు ఫోన్ చేసి అపాయింట్‌మెట్ తీసుకోవాలని కోరారు.



నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

జాతీయ స్థాయిలో కుల గణన చేపట్టాలి

తార్నాక, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేపట్టాలని ఓయూలోని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఓబీసీఎస్‌ఏ, ఎన్ఎస్‌యూఐ, ఏఎంఎస్ఏ, ఏఎస్ఏ, ఏబీఎస్ఏ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కులగణన చేపట్టి సంపూర్ణ సామాజిక న్యాయం చేస్తామని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఓబీసీ, ఇతర అణగారిన వర్గాల సంక్షేమానికి జాతీయ స్థాయిలో కులగణనను చేపట్టాలని వారన్నారు. లేనిపక్షంలో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. సీహెచ్. గణేష్, జాతీయ ఓబీసీ హక్కుల పరిరక్షణ వేదిక అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి. కిరణ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి సత్యనెల్లి, లెనిన్, దివ్యరాయ్, రవినాయక్, ఆంజనేయులు, వికాస్ యాదవ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జీడిమెట్ల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. బైక్‌పై వెళ్తున్న అతడిని వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ఢీ కొట్టడంతో తీవ్రగాయాల పాలై ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ సంఘట జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మబండ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. గాజులరామారం మహదేవ్‌పురం సమీపంలోని సిక్‌బస్తీకి చెందిన విక్రమ్‌సింగ్(22) శుక్రవారం ఎల్లమ్మబండ నుంచి సిక్‌బస్తీకి బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమైంది. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..

జీడిమెట్ల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో నివాసముంటున్న యాదగిరి (22) డ్రైవర్. శివమాల ధరించాడు. గురువారం మధ్యాహ్నం స్థానికంగా ఉన్న ఆలయం సమీపంలోని ఓ మూడంతస్తుల భవనం పైనుంచి కిందపడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు.ఈ సంఘటను పోలీసులు గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి ఆత్మహత్య

గాజులరామారం. ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి నిజాంబాద్ జిల్లా బోధన్‌కు చెందిన మొగిలి ప్రసన్న(25), వెంకట్ భార్యాభర్తలు. వీరు బతుకుదెరువు కోసం ఆరు నెలల క్రితం నగరానికి వచ్చి సూరారంలోని ముత్యాల బస్తీలో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. ప్రసన్న వెంకట్ కారు డ్రైవర్. భార్య ప్రసన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఉద్యోగి. రోజు మాదిరిగానే ఈనెల ఒకటిన ప్రసన్న డ్యూటీకి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు. కుటుంబ సభ్యులు తలుపులు తీసి ప్రసన్నను సూరారంలోని హాస్పిటల్‌కు తరలించాగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. వీరికి కరోనా సమయంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయని, అవి తీర్చే మార్గం లేక మనస్థాపానికి గురైన ప్రసన్న ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీకి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత





ఎంఏనగర్ పక్కన ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు



కూల్చవద్దని వేడుకుంటున్న స్థానికులు

మియాపూర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలు, ప్రహరీలను శుక్రవారం హుడా అధికారులు పోలీస్ సిబ్బందితో కలిసి ఎక్స్‌కవేటర్ సాయంతో కూల్చివేశారు. కొన్ని రోజుల నుంచి శేరిలింగంపల్లి మండల పరిధిలోని మియాపూర్ ఎంఏనగర్ పక్కన ఉన్న ప్రభుత్వ సర్వేనెంబర్ 100, 101లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి గదు లు నిర్మిస్తున్నారని సమాచారం అందుకున్న హుడా ఎస్టేట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక హుడా అధికారులు 12 అక్రమ నిర్మాణాలను గుర్తించి అందులో రెండు ఇళ్లను పాక్షికంగా కూల్చివేశారు. తాము ఎప్పటి నుంచో ఇక్కడ ఉంటున్నామని స్థానికులు ఎక్స్‌కవేటర్‌కి అడ్డుగా పడుకోవడంతో కొన్ని పాక్షికంగా, మరికొన్ని పూర్తిగా కూల్చివేశారు.

వాస్తవానికి కొందరు స్థానిక నేతలు ఇక్కడ అక్రమ నిర్మాణాలకు ఆజ్యం పోస్తూ ప్రభుత్వ భూమిని పేద, మధ్యతరగతి వారిని ఆసరాగా చేసుకుని 80 గజాల స్థలాన్ని రూ. 10 లక్షల నుంచి 20 లక్షలకు అమ్ముతున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.



జగదీశ్వర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేస్తున్న గోకుల్‌ప్లాట్స్ వాసులు

గోకుల్‌ప్లాట్స్‌లో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న స్థానికులు

మియాపూర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మియాపూర్ గోకుల్ ప్లాట్స్‌లో 100 గజాల్లో అక్రమంగా ఆరు అంతస్తులు నిర్మిస్తున్నారని స్థానికులు జీహెచ్ఎంసీ, అధికారులకు ఫిర్యాదు చేశారు. గోకుల్‌ప్లాట్స్ ఎన్టీఆర్ గార్డెన్ సమీపంలో ఓ ప్రైవేట్ వ్యక్తి 100 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం కోసమని 'అపార్టుమెంట్ కడతానని స్థానికులకు నచ్చజెప్పి, తర్వాత లాడ్జీలు నిర్మిస్తారని తెలిసి వివాదం మొదలైంది. దీంతో చుట్టుపక్కల వారు యజమానిని నిలదీయడంతో ఎదురు దాడికి దిగాడు. దీంతో స్థానిక కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, పోలీసులకు, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానికులకు ఇంటి యజమానికి మధ్య వాగ్వాదం జరిగింది. సిబ్బందితో జీహెచ్ఎంసీ అధికారులు 100గజాల్లో అక్రమ నిర్మాణాన్ని పాక్షికంగా కూల్చివేశారు. నిర్మాణం చేపట్టవద్దని హెచ్చరించారు.

భూముల పరిరక్షణలో భాగస్వాములు కావాలి : ఆర్డీఓ మల్లయ్య

గచ్చిబౌలి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం భూముల రక్షణలో అన్ని ప్రభుత్వ విభాగాలతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని రాజేందర్‌నగర్ ఆర్డీఓ మల్లయ్య అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ నిర్ణయాలవల్ల రెవెన్యూ విభాగం పూర్తిగా విచ్ఛిన్నమైంది, కిందిస్థాయి ఉద్యోగులు లేకపోవడంవల్ల ప్రభుత్వ ఆస్తులు, భూములను రక్షించడంలో కష్టతరంగా మారిందన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురైతే రెవెన్యూ అధికారులపై ఆరోపణలు, నిందించడం చేస్తున్నారు. దీంతో స్వచ్ఛందంగా పనిచేసే అధికారులు కూడా ఇబ్బంది పడుతున్నారని ఆర్డీఓ మల్లయ్య పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో ఏమీ చేయలేని స్థితిలో ఉండాల్సి వస్తోందన్నారు.

రెవెన్యూ శాఖను నిందించడం సరికాదు

నగరంలో చాలా వరకు చెరువులు, కుంటలు కనుమరుగవుతున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్ని ప్రభుత్వ శాఖలు భాగస్వామ్యమవుతున్నాయి. జీహెచ్ఎంసీ విద్యుత్‌శాఖ అధికారుల పాత్ర కూడా చాలా వరకు ఉంటుంది. సుందరీకరణ పేరుతో చెరువుల అభివృద్ధి జరుగుతోంది. ఈ పనులు పూర్తిగా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ఇరిగేషన్ అధికారుల ఆధీనంలో ఉంటాయి. కానీ వీరందరినీ వదిలేసి కేవలం రెవెన్యూ అధికారులను నిందించడం ఎంతవరకు సమంజసమని ఆయన అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చెరువులు, కుంటల సుందరీకరణ పనులు ప్రభుత్వమే చేస్తుంది. ఓ రకంగా చెరువుల పూడ్చివేత అనికూడా అనవచ్చు. ఇదే జరిగితే భవిష్యత్‌లో చెరువులు, కుంటలు కనుమరుగయ్యే అవకాశం ఉంది. పూర్వం చెరువులు, కుంటలో నీరు సమృద్ధిగా ఉండేది. దీంతో సాగు, తాగునీటికి కొరతలేకుండా ఉండేది. ఇప్పటికైనా ప్రభుత్వం భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని చెరువులు, కుంటలను రక్షిస్తే ప్రజలకు నీరు సమృద్ధిగా అందించిన వారవుతారని పలువురు సామాజిక వేత్తలు అభిప్రాయ పడుతున్నారు.



నర్సాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి దీనదయాల్‌నగర్ దారిలో వేసిన మట్టి కుప్పలు

అధికారుల ఆదేశాలు బేఖాతర్

- రోడ్ల పక్కన భవన నిర్మాణ వ్యర్థాలు

ఫతేనగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన భవన నిర్మాణ వ్యర్థాలు వేయకూడదని, వేస్తే చర్యలు తప్పవని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ ఆదేశాలను జారీ చేస్తే వాటిని కొందరు అతిక్రమిస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా ఎవ్వరూ చూడని సమయంలో భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్డు పక్కన వేసి చేతులు దులుపుకొంటున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులెవ్వరూ పట్టించుకోక పోవడంతో రోజుకో కుప్ప వచ్చి చేరుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్డు పక్కన వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటికి అవస్థలు

- నెల రోజులుగా పాట్లు
- పాడైన మ్యాన్‌హోల్ వాల్
- పట్టించుకోని యత్రాంగం
- ఖాళీ బిందెలతో రహదారిపై మహిళల నిరసన



ఖాళీ బిందెలతో రహదారిపై నిరసన తెలుపుతున్న మహిళలు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నెల రోజుల నుంచి గుక్కెడు తాగునీరు రాక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. తాగునీటి మ్యాన్‌హోల్ పాడై నెల రోజులు అవుతోంది. తాగునీటి సరఫరా నిలిచిపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయాలని స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘం నాయకులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానిక మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి నిరసనగా కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి పద్మానగర్ ఫేజ్-2లోని రోడ్డు నెంబర్ 3లోని మహిళలు ఖాళీ బిందెలతో రహదారిపైకి వచ్చారు. అధికారులకు ముక్కుపిండి నీటి బకాయిలను వసూలు చేయడంలో ఉన్న చిత్తశుద్ధి సమస్యను పరిష్కరించి, తాగునీటి సరఫరా చేయడంలో లేదని, నెల రోజుల నుంచి తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు రాకపోవడంతో బోరు నీరు వాడుకుందామంటే అవి కెమికల్ వాసన వస్తోందన్నారు. సమస్యలను పరిష్కరించాలని లైన్‌మెన్‌ను అడిగితే పొంతనలేని సమాధానాలు చెప్పుబుతున్నాడని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేదంటే ఖాళీ బిందెలతో జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని మహిళలు హెచ్చరించారు.

కల్వర్టు పనులు త్వరగా పూర్తి చేయాలి



కల్వర్ట్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

వివేకానందనగర్‌కాలనీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మాదవరంకాలనీ సమీపంలోని నాలాపై రూ. 90లక్షలతో చేపట్టిన కల్వర్టు పనులను శుక్రవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. కల్వర్టు నిర్మాణంతో వర్షాకాలంలో ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుందని, పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, నాయకులు రంగారావు, సంజీవరెడ్డి, శ్రీనివాస్, మోజేష్, వెంకటిరెడ్డి, చంద్రమోహన్, జగదీష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

మియాపూర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వివిధ డివిజన్లలో చేపట్టాల్సిన పెండింగ్, అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శుక్రవారం కార్పొరేటర్లు, పలుశాఖల అధికారులతో కలిసి క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చందానగర్, శేరిలింగంపల్లి సర్కిళ్ల పరిధిలోని డివిజన్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ఇంటి పన్నులను వసూళ్లు చేయాలని ఆదేశించారు. కార్పొరేటర్లు నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, హమీద్‌పటేల్, మంజుల, సింధు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, అధికారులు ఎస్ఈ శంకర్‌నాయక్, ఈఈలు శ్రీనివాస్, శ్రీకాంతిని, డీఈలు దుర్గాప్రసాద్, శిరీష, విశాలక్ష్మి, ఏఈలు రమేష్, సునీల్, జగదీశ్, ప్రశాంత్, ప్రతాప్, సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ఉదారత



చెక్కు అందజేస్తున్న పాఠశాల నిర్వాహకులు


నిజాంపేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ సరదాల కోసం దాచుకున్న డబ్బులను అనాథ ఆశ్రమాలకు అందజేసి వారి ఉదారతను చాటుకున్నారు. బాచుపల్లిలోని సిల్వర్ హోక్స్ అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు అందజేసిన రూ. 24లక్షల్లో వరంగల్ జిల్లా కల్లెడలోని రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్‌కు రూ. 19లక్షలు, ఆంధ్రప్రదేశ్‌లోని నర్సారావుపేటలోని నైసా అనాథ ఆశ్రమానికి రూ. 5లక్షలు విరాళంగా పాఠశాల యాజమాన్యం, అధ్యాపకులు అందజేశారు.

53 శాతం పన్ను వసూళ్లు

- గడువులోపు టార్గెట్ అందుకుంటాం

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ అధికారులు 2023-24 ఆస్థిపన్ను వసూళ్లలో దూకుడు పెంచారు. ఉన్నతాధికారులు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం రూ.11 కోట్ల 76 లక్షలు ఇంటి, దుఖాణ సముదాయాల నుంచి పన్ను వసూళ్లు చేయనుంది. కొంపల్లిలో ఇప్పటి వరకు దాదాపు 12 వేల పైచిలుకు సాధారణ నివాసాలు ఉండగా 8 వందల వరకు వ్యాపార సముదాయాలు ఉన్నట్టు లెక్కలు చెబుతున్నారు. ఇప్పటి వరకు రూ. 6 కోట్ల 23 లక్షలను మున్సిపల్ అధికారులు వసూళ్లు చేశారు. మిగిలిన రూ. 5 కోట్ల 52 లక్షలు వసూళ్లు చేసేందుకు అధికారులు యత్నిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 53 శాతం వసూళ్లు చేశామని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి తెలిపారు. ఇంటి పన్ను చెల్లించని యజమానులు గడువులోగా పన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దుర్గంగౌడ్



పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గౌడ జన హక్కుల పోరాట సమితి పొలిట్ బ్యూరో సభ్యుడిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మెదక్ జిల్లా కొడిపల్లికి చెందిన డాక్టర్ చంద్రం దుర్గంగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప్పల్‌లోని రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నాయకుడు ప్రజల మధ్యే ఉండాలి



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను సన్మానిస్తున్న కాలనీ వాసులు

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నాయకుడు అంటే ఎన్నికల ముందు కనిపించి, తర్వాత కనిపించడని ప్రజల్లో ఉన్న భావనను పోగొట్టేందుకే కృతజ్ఞత యాత్రను చేపట్టామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. 19వ రోజు కృతజ్ఞత యాత్రలో భాగంగా శుక్రవారం జీడిమెట్ల డివిజన్‌లోని న్యూ వివేకానందనగర్, ప్రసన్ననగర్, శ్రీనివాస నగర్‌ఫేజ్-1, 2, 3, 4ల్లో ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం పని చేసే నాయకుడిగా నిత్యం ప్రజల్లో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో ఆయా కాలనీల అధ్యక్షులు, మహిళలు, డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రభల తీర్థం





గచ్చిబౌలి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అపర్ణ సరోవర్ ప్రభల తీర్థం తొలినాటి వేడుకలు శుక్రవారం వైభవంగా స్త్రీశక్తితో మొదలయ్యాయి. హైటెక్ ప్రాంతంలో సంతరించుకున్న పల్లె జాతరలో మహిళలు ఆట పాటలతో సందడి చేశారు. ఈశ్వరుడి పల్లె జాతరలో ఒకటా.. రెండా కట్టెల పొయ్యి మీద మట్టికుండలో పాయసం, పరమాన్నం వండి మహిళల ఆధ్వర్యంలో ఈ వేడుకలు సూర్యశివ ఆదరణతో మొదలు పెట్టారు. గుహలో నీటి జలపాతాలతో స్త్రీలు తయారు చేసిన మందిరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఆనందంగా ఆటపాటలు..

పల్లెలో నాడు ఆడిన ఆటలను గుర్తు చేస్తూ ఆనందోత్సహాలతో మహిళలు చిన్నా, పెద్దా తేడా లేకుండా ఆటపాటలతో సందడి చేశారు. చింతపిక్కలాట, గవ్వలాటలు, గచ్చకాయలు, వైకుంఠపాళి, ఏడు పెంకులాట, చాకలి బాణా, అగ్ని కుండ్, పులిమేక, వామనగుంటలతో పాటు నాటి రోజులను గుర్తు చేస్తూ ఆడిన ఆట పాటలు అందరిని ఉత్సాహపరిచాయి. ఉదయం, సాయంత్రం నిర్వహించిన పోటీల్లో మహిళలు తమ చిన్ననాటి రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో పలురాష్ట్రాల వారు పాల్గొంటున్నారు.



మట్టికుండలో కట్టెల పొయ్యిమీద వంట చేస్తున్న దృశ్యం



ఆటలు ఆడుతున్న మహిళలు

సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టాయి

సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ప్రభల తీర్థం వేడుకలు అపర్ణ సరోవర్‌లో జరుగుతున్నాయి. ప్రభల తీర్థం వేడుకలు పల్లె వాతావరణాన్ని కళ్ల ముందుకు తెచ్చాయి. పంచగవ్య పుష్పం వెలిగించి వేడులకు ఆరంభించడం ఆనందంగా ఉంది. మహిళలు వ్యాపార రంగంతో పాటు అన్ని రంగాల్లో తమ ప్రతిభ చాటుతున్నారు. కష్టపడి స్వయం శక్తితో ఎదిగే మహిళలకు నా సహకారం ఉంటుంది.

- ప్రవీణా నాయుడు తోట, ఉమెన్ ఎన్వీజన్ కౌన్సిల్ అంత్రప్రైన్యూర్ షిప్ ఫౌండర్

కాంగ్రెస్ నాయకులకు జిల్లా స్థాయి పదవులు

గచ్చిబౌలి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా భరత్‌గాంధీ రెడ్డి, జనరల్ సెక్రటరీగా రఘుపతిరావును నియమిస్తూ శుక్రవారం జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహా రెడ్డి వారికి నియామక పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు సీఎం రేవంత్‌రెడ్డి, చల్లా నరసింహా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బోరబండ రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా హరికృష్ణ



అల్లాపూర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బోరబండ రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీలో సభ్యుడిగా దక్షిణ మధ్య రైల్వే ఎంపిక చేసినట్టు బీజేపీ అల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బొంతు హరికృష్ణ తెలిపారు. రైల్వేను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, రైల్వే సేవలను మెరుగుపర్చేందుకు ఈ కమిటీలను నియమిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్నిచ్చిన అధికారులకు, బీజేపీ మేడ్చల్ అర్బన్ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డికు హరికృష్ణ కృతజ్ఞలు తెలిపారు.

'టెన్త్'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఈవో

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థుల్లో నెలకొనే భయాన్ని పోగొట్టేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా డీఈవో విజయకుమారి అన్నారు. కూకట్‌పల్లిలోని పీఎఎం పాఠశాల ఆవరణలోని ఆడిటోరియడంలో శుక్రవారం జిల్లా గణిత, తెలుగు ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గణిత, తెలుగు పరీక్షలకు విద్యార్థులను ఎలా సన్నద్ధం చేయాలన్న అంశంపై వీడియో ప్రజెంటేషన్ చూపించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సురేష్‌కుమార్, భానుప్రకాష్, ఎంఈవోలు ఆంజనేయులు, రవీందర్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో శనివారం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పాల్గొని నాయకులు, కార్యకర్తలకు పార్టీ అభివృద్ధి, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహాలపై అవగాహన కల్పించనున్నారు. ఉదయం 11గంటలకు జరిగే సమావేశానికి పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఎమ్మెల్యే కోరారు.